
సాక్షి కాకినాడ

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



కంప్యూటర్ సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం బళ్ల చంద్రశేఖర్ (రామేశ్వరం) కంప్యూటర్‌ను సమర్పించారు.



గౌతమి ఎక్స్‌ప్రెస్ రద్దు

కాకినాడ: కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన గౌతమి ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం రద్దు చేశారు. విజయవాడలో వరదల నేపథ్యంలో రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి పూజలు



పిఠాపురం: పట్టణంలో ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభస్వామి జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

లోవ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు శ్రీకారం



మాస్టర్ ప్లాన్‌పై చర్చిస్తున్న అధికారులు

తుని రూరల్: తలుపులమ్మవారి లోవ దేవస్థానం అభివృద్ధికి రూపొందించనున్న మాస్టర్ ప్లాన్‌కు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్, డీఈ ఉదయ్ కుమార్, డిప్యూటీ స్థపతి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం లోవ దేవస్థానాన్ని సందర్శించింది. ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు మాట్లాడుతూ వేల సంఖ్యలో తరలి వస్తున్న భక్తులు, వాహనాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రాథమిక రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు మార్పులు, చేర్పులు చేసి పది రోజుల్లో అనుమతుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈలు కేవీ.రమణ, వీరభద్రరావు పాల్గొన్నారు.

విజయవాడకు ప్రత్యేక బృందాలు



పారిశుధ్య కార్మికులు వెళుతున్న బస్సు వద్ద డీపీఓ భారతీ సౌజన్య

బోట్‌క్లబ్ (కాకినాడ): భారీ వర్షాల కారణంగా విజయవాడను వరదలు ముంచెత్తడంతో అక్కడ పారిశుధ్య పనులు చేసేందుకు జిల్లా నుంచి ప్రత్యేక బృందాలను పంపినట్టు జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య తెలిపారు. కాకినాడ జిల్లా నుంచి పంచాయతీ కార్యదర్శి సారథ్యంలో ముగ్గురు స్వీపర్లు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్‌ను ఒక బృందం ఏర్పాటు చేసి, మొత్తం 34 బృందాలను బుధవారం ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు పంపినట్టు వివరించారు.

యువకుడి దుర్మరణం



ప్రమాద స్థలం వద్ద లారీ, మోటార్ సైకిల్, మృతదేహం

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లి జిల్లా కోట ఊరట్ల మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన కరణం నవీన్ (సిద్ధు) (22) మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో కలసి విజయవాడ వెళ్లాడు. అనంతరం తన స్వగ్రామం వస్తుండగా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారుకు వచ్చే సరికి ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. అతని తలకు బలమైన రక్తపు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ డ్రైవర్ ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా తన ట్యాంకర్‌ను పార్క్ చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ మేరకు మృతుడి చిన్నాన్న కరణం కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించామన్నారు.

జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, నావిస్ హెచ్ఆర్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, జీఎన్ఎం, బీఎస్సీ చదివిన అభ్యర్థులకు జపాన్ దేశంలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి హరిశేషు బుధవారం తెలిపారు. జపాన్‌లో పని చేయడానికి 32 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని, ఆరు నెలల పాటు బెంగళూరు నావిస్ సంస్థలో శిక్షణ ఇచ్చి, ఆ దేశంలో ఉద్యోగం కల్పిస్తారన్నారు. ఫీజు రూ.3 లక్షలు చెల్లించాలని, ముందుగా రూ.25 వేలు అభ్యర్థి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే రూ.25 వేలు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ చెల్లిస్తుందన్నారు. మిగిలిన ఫీజు లోన్ సౌకర్యం కల్పిస్తారని, ఉద్యోగం పొందిన అభ్యర్థికి జపాన్‌లో రూ.1.10 లక్షల నుంచి రూ.40 వేల వరకూ వస్తుందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 10వ తేదీలోగా 94921 41999 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వరుణాగ్రహం

- ముంపు బారిన పంటలు
- అన్నదాతల ఆవేదన



సుద్దగడ్డ పొంగడంతో గొల్లప్రోలులో వరద నీటిలో ప్రజల అవస్థలు

పిఠాపురం: జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణాలు, గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. రోడ్లు, వీధులు చెరువులుగా మారిపోతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరి, వాణిజ్య పంటలు నీట మునగడంతో నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని జగ్గంపేట, తుని, పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, ప్రత్తిపాడు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచే వర్షం మొదలైంది. పల్లపు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. తాళ్లరేవులో 26.2, కాజులూరులో 18.6, కాకినాడ పట్టణంలో 7.4, కరపలో 6.2, గండేపల్లిలో 4.2, శంఖవరంలో 4, గొల్లప్రోలులో 3.2, కోటనందూరులో 3.2, కొత్తపల్లిలో 2.8, పెద్దాపురంలో 2.2, తునిలో 2.2, పెదపూడిలో 2.2, ఏలేశ్వరంలో 2, ప్రత్తిపాడులో 2, కిర్లంపూడిలో 1.8, కాకినాడ రూరల్‌లో 1.8, సామర్లకోటలో 1.6, పిఠాపురంలో 1.2, తొండంగిలో 0.8, రౌతులపూడిలో 0.6, జగ్గంపేటలో 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం 94.6 మిల్లీమీటర్లు నమోదైనట్టు అధికారులు తెలిపారు. కాగా.. మరో అల్పపీడనం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సుద్దగడ్డ ఆధునీకరణ చేయక పోవడం వల్ల ఏటా రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేల ఎకరాలకు సాగునీరు అందించే ఏలేరు కాలువ జిల్లాలో పంటలను ముంచెత్తుతోంది.

1500 క్యూసెక్కుల విడుదల

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలేరు ప్రాజెక్టు నుంచి బుధవారం 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో పెద్దాపురం, పిఠాపురం, తుని ప్రాంతాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ షణ్మోహన్ ఏలేరు నీటితో ముంపు బారిన పడే పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలంలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు గొల్లప్రోలు మండలాన్ని నీట ముంచింది. ఇప్పటికే వరి, పత్తి, మిరప, బంతి, చిక్కుడు, ఆకాకర, టమాటా, వంగ, బెండ పంటలు నీట మునిగాయి. సుద్దగడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు సూరంపేట వద్ద రహదారులు ముంపుబారిన పడ్డాయి. అలాగే చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునిగాయి.

ఏలేరు ప్రాజెక్టు పరిశీలన

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టును కలెక్టర్ షణ్మోహన్ బుధవారం పరిశీలించారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో నీటినిల్వలు పెరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరో నాలుగు రోజులు పాటు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేటప్పుడు దిగువ గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కాగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. వర్షాల కారణంగా సమస్య తలెత్తితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ -1800 4253077కు సమాచారం అందించాలన్నారు. అలాగే సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు.

- గురువారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ 91772 17896, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకూ 9505271155, రాత్రి 8 నుంచి తర్వాత రోజు ఉదయం ఏడు గంటల వరకు 79976 72438 నంబర్లకు ఫోన్ చేయాలి.
- శుక్రవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం రెండు వరకూ 79976 72438, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు 95020 17997, రాత్రి 8 నుంచి తర్వాత రోజు ఉదయం 7 వరకూ 81848 38068 నంబర్లను సంప్రదించాలి.
- 7వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకూ 95503 68149, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకూ 80087 52520, రాత్రి 8 నుంచి ఉదయం 7 వరకు 85220 86785 నంబర్‌ను సంప్రదించాలి.



గొల్లప్రోలులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్



ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదల అవుతున్న నీరు

13న యువతకు పోటీలు

కాకినాడ రూరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాలలో భాగంగా ఈనెల 13వ తేదీన కాకినాడ యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో యువతకు పోటీలు నిర్వహించనున్నారు. సెట్రాజ్ ముఖ్యకార్యనిర్వహణాధికారి కె.శ్రీరమణి బుధవారం ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల వయసున్న వారికి నేపథ్య విభాగంలోని సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణ, సాంస్కృతిక విభాగంలోని జానపద నృత్యానికి సంబంధించి బృందం, సోలో, గేయం, సోలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జీవన నైపుణ్య విభాగంలో కథ రాయడం, కవిత్వం, చిత్రలేఖనం, డిక్లమేషన్ పోటీలు జరుగుతాయన్నారు. యువకృతిలో పాల్గొనేందుకు హస్తకళల కళాకారులకు అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2024ను స్థానిక ఎస్ఎఫ్‌సీ ఎల్ రోడ్డు సత్యకళావాహినిలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 'క్యూఆర్‌సీసీ. ఎంఈ/ఎస్ఐడబ్ల్యూ373యుసీఎఫ్‌డీజీ అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మరిన్న వివరాలకు సెట్రాజ్ కార్యాలయాన్ని 98499 13065 సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలోని రెండు ప్రాంతాలలో రేషన్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని గండి నరేష్ షెడ్డును తనిఖీ చేసి, 3012 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అనపర్తికి చెందిన కోనాల ఆనంద రెడ్డి సూచన మేరకు కనకాల దుర్గారావు ఈ బియ్యాన్ని కాకినాడ ప్రాంతానికి చెందిన కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి, యానాం, కాజులూరు ప్రాంతాలలో ఇటుక బట్టీ కార్మికులకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సుమారు రూ.2,94,552 విలువైన 3012 కేజీల రేషన్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి నిందితులపై 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే కాజులూరు మండలం పాత ముంజేరు వంతెన సమీపంలో ఒక వాహనంలో తరలిస్తున్న సుమారు 2800 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సలాది జగదీష్‌ను, అతడి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.

కొబ్బరి ధరహాసం

- పండగలతో అంబాజీపేట మార్కెట్‌లో పెరిగిన ధర
- వెయ్యి నీటి కాయలు రూ.12 వేలు
- ఉత్తరాదికి పెరిగిన ఎగుమతులు



అంబాజీపేటలో వ్యాపారుల వద్ద ఉన్న కొబ్బరి రాశి

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: కొబ్బరి మార్కెట్ కళకళలాడుతోంది. వరుస పండగలు కావడంతో కొబ్బరి కాయల ధర అంచనాలకు మించి పెరుగుతోంది. ప్రస్తుతం అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో నీటికాయ (నెల రోజుల ముక్కుడు కాయ) వెయ్యి ధర రూ.12 వేలకు చేరింది. పచ్చి కాయ ధర రూ.11 వేలు పలుకుతోంది. వారం రోజుల కిందట నీటికాయ వెయ్యి ధర కేవలం రూ.పది వేలు మాత్రమే ఉండేది. గడిచిన వారం రోజుల్లో ఏకంగా రూ.రెండు వేలు పెరగడం కొబ్బరి మార్కెట్‌లో ఉత్సాహాన్ని నింపింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వస్తున్న ఆర్డర్లతో కొబ్బరికాయ ధర పెరుగుతోంది.

కొబ్బరికి మంచి రోజులు వచ్చాయి. ధర పెరుగుతూ వస్తోంది. శ్రావణ మాసం తరువాత ఈ నెల వినాయక చవితి ఉత్సవాలు, అక్టోబర్ 12న దసరా ఉత్సవాలు, అదే నెల 31న దీపావళి, తరువాత నుంచి కార్తిక మాసం ఇలా వరుస పండగలతో కొబ్బరి కాయకు డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు దిగుబడి తగ్గడం కూడా కాయ ధర పెరగడానికి కారణమైంది. ఎకరాకు ప్రస్తుతం సగటున 500 కాయల దిగుబడి మాత్రమే వస్తోంది. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల దిగుబడి కనీసం 900 నుంచి వెయ్యి కాయల వరకూ ఉంటోంది. ఈ సమయంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, రాజస్తాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖాండ్, మధ్యప్రదేశ్, ఛతీస్‌ఘడ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు 120 నుంచి 150 లారీల వరకు పచ్చికాయల ఎగుమతి అయ్యేది. ఇప్పుడు ధర ఉన్నా కేవలం 60 నుంచి 80 లారీల కొబ్బరికాయలు మాత్రమే ఎగుమతి కావడం వెనుక దిగుబడి తగ్గడమే కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతుండగా, ఏటా 122.50 కోట్ల కాయలు దిగుబడిగా వస్తోందని అంచనా. అంబాజీపేట మార్కెట్ ధరలపైనే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరి ధరల నిర్ణయం జరుగుతోంది. ఇక్కడ పెరగడం, తగ్గడంపైనే మిగిలిన ప్రాంతాల్లో కొబ్బరి ధరల్లో మార్పులు చోటు చేసుకుంటాయి.

రాశులు లేక దిగాలు

కొబ్బరి ధర పెరిగినా రైతుల వద్ద అనుకున్న స్థాయిలో రాశులు లేవు. ఇప్పటికే మూడొంతుల కాయ వ్యాపారుల వద్ద ఉంది. మే నెలలో నాఫెడ్ కేంద్రాలు తెరిస్తే కొబ్బరి కాయలకు డిమాండ్ వస్తోందని రైతులు భావించారు. ఇందుకు తగినట్టుగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు వచ్చిన కాయలను తమ వద్దే రాశులుగా ఉంచుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం నాఫెడ్ కేంద్రాలను జూలై మొదటి వారంలో కాని తెరవలేదు. తెరిచిన తరువాత స్థానికంగా ఉన్న ఎండు కొబ్బరిని కొనుగోలు చేయకుండా కేరళ, తమిళనాడు నుంచి దొడ్డిదారిన తెచ్చిన కొబ్బరి కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక కొబ్బరికి ధర రాలేదు. ఈ విధానం చూసిన రైతులు తమ వద్ద ఉన్న కొబ్బరి రాశులను ఆగస్టులోనే వ్యాపారులకు అమ్మేశారు. మూడొంతుల దిగుబడి వ్యాపారుల వద్దకు చేరిన తరువాత ధర పెరగడం విశేషం. మార్కెట్‌లో కొబ్బరి పెరిగిన ఆనందం రైతులకు పూర్తి స్థాయిలో లేకుండా పోయింది. వచ్చే దింపు వరకూ ఈ ధర ఉంటే కొంత మేలని రైతులు చెబుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండడం, పండగల మార్కెట్ ఉన్నందున ధర మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- ఘటన చూసి చలించిన కలెక్టర్ షణ్మోహన్
- ఆసుపత్రికి బాధితుల తరలింపు



ముసలారావును ఆసుపత్రికి తీసుకు వస్తున్న కలెక్టర్ భద్రతా సిబ్బంది



గాయపడిన పొన్నాడ హరిగంగాధర్



మృతుడు సిద్ధాంతపు ముసలారావు (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: కాకినాడ- ప్రత్తిపాడు జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అదే సమయంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయాన్ని పరిశీలించి తిరిగి వస్తుండగా ధర్మవరం వద్ద ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను గుర్తించారు. వెంటనే ప్రోటోకాల్ వాహనంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలించారు. సీహెచ్‌సీ ఆర్ఎంఓ సౌమ్యకు ఫోన్ చేసి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సిద్ధాంతపు ముసలారావు వన్నెపూడి గ్రామంలో డ్వాక్రా యానిమేటర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా చెందుర్తి నుంచి బైక్‌పై ధర్మవరం యూనియన్ బ్యాంకుకు బయలు దేరారు. జాతీయ రహదారి పైనుంచి ధర్మవరం గ్రామంలోకి వెళ్తుండగా ఈ బైక్‌కు వెనుక వస్తున్న గొల్లప్రోలుకు చెందిన బొమ్మిడి బాబి, పొన్నాడ హరిగంగాధర్‌లకు చెందిన బైక్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సిద్ధాంతపు ముసలారావు (52), పొన్నాడ హరిగంగాధర్ (బైక్ వెనుక కూర్చున్న యువకుడు)లు గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వీరిని కలెక్టర్ షణ్మోహన్ తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఇందులో సిద్ధాంతపు ముసలారావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు పాతికేళ్ల క్రితం దుర్గాడ నుంచి చెందుర్తి వచ్చి ఇక్కడ ఆర్ఎంపీగా స్థిరపడ్డాడు. గాయపడిన పొన్నాడ హరిగంగాధర్ పిఠాపురంలో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాజానగరంలో పరీక్ష రాసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా ప్రాంతాన్ని తహసీల్దార్ సూర్యప్రభ, సీహెచ్‌సీ ఆర్ఎంఓ పరిశీలించారు.

సమాజ శిల్పులు ఉపాధ్యాయులు

- నేడు జిల్లా ఉత్తమ అవార్డుల ప్రదానం
- ఏర్పాట్లు చేసిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

రాయవరం/ బాలాజీచెరువు (కాకినాడ)/ కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సమాజ శిల్పులు ఉపాధ్యాయులు.. వీరికి స్ఫూర్తిగా నిలిచే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. ఇందులో భాగంగానే గురువారం ఉమ్మడి తూర్పు తూర్పుగోదావరి వ్యాప్తంగా గురుపూజోత్సవం నిర్వహించుకునేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కోనసీమకు సంబంధించి అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహించనున్నారు. దీనికోసం జిల్లా యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, మండల పరిషత్, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ జిల్లాలో ఉత్తమ అవార్డులకు 42 మంది ఉపాధ్యాయులను ఎంపికయ్యారు.

- కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే ఆడిటోరియంలో ఈ వేడుకలు జరుగుతాయని డీఈఓ పిల్లి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా 70 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.
- తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయులుగా 70 మందిని ఎంపిక చేశామని డీఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షత ఏర్పడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికను నిర్వహించింది. వీరికి రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో అవార్డులను అందించి సత్కరిస్తారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఉదయం 8 గంటలకే హాజరు కావాలని డీఈఓ కోరారు.

రైల్వేలైన్ అలైన్‌మెంట్‌పై అభ్యంతరాలు తెలపండి

అమలాపురం రూరల్: కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ ప్రస్తుత అలైన్‌మెంట్‌పై గ్రామాల వారీగా సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురం మండలం భట్నవిల్లిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నిషాంతి మాట్లాడుతూ కోటిపల్లి- నరసాపురం ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ అమలాపురం రూరల్ మండలంలో భట్నవిల్లి, కామనగరువు, రోళ్లపాలెం, పేరూరు, ఇమ్మిడివరప్పాడు గ్రామాల మీదుగా వెళ్తుందన్నారు. ఆయా గ్రామాల్లో రైల్వే అలైన్‌మెంట్‌కు అడ్డుగా రోడ్లు, కాలువలు, విద్యుత్ లైన్లు, స్తంభాలు, ఓఎన్జీసీ, గెయిల్ పైపులైన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, నివాసాలు ఉన్నాయా లేదా అని సర్వే చేసి ప్రజలు, ప్రభుత్వ శాఖల నుంచి అభ్యంతరాలను సూచించిన ప్రొఫార్మాలో ఈ నెల 17 లోపు సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ జేడీ కిశోర్‌బాబు, రెవెన్యూ, సర్వే అధికారులు పాల్గొన్నారు.



భట్నవిల్లిలో రైల్వే లైన్ అలైన్‌మెంట్‌ను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి